క్లుప్తంగా

8న ఉపాధి పనులపై ప్రజావేదిక

కంచిలి: ఈ నెల ఎనిమిదో తేదీ ఉదయం పది గంటలకు గడచిన ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో నీరజ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ప్రజావేదికను ఏర్పాటు చేశామన్నారు.

అనాథ శరణాలయానికి సాయం



చిన్నారులకు సాయం అందజేస్తున్న దృశ్యం

కంచిలి: పాతపట్నంలోని లవ్‌లీ చిల్డ్రన్ బాల బాలికల అనాథ శరణాలయానికి కంచిలి మండలంలోని సీతయ్య ఫౌండేషన్, ఇచ్ఛాపురం మండలం పేటూరు గ్రామానికి చెందిన మృత్యుంజయ ఫౌండేషన్లు కలిపి నిత్యావసర వస్తువులు, దుస్తులు, దుప్పట్లు, చాపలను వితరణగా ఇచ్చారు. వీరు పాతపట్నం వెళ్లి సోమవారం కలిసి పంపిణీ చేశారు.

బాలికలకు వృత్తి విద్యలో శిక్షణ



శిక్షణకు వచ్చిన బాలికలు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కేజీబీవీలో చదువుతున్న బాలికలకు స్థానిక స్టేట్‌బ్యాంక్ వద్ద టైలరింగ్, డిజైనింగ్, బొమ్మాల తయారీ, ఆకర్షణీయ వస్తువుల తయారీపై సోమవారం శిక్షణ కార్యకరమాన్ని నిర్వహించారు. చదువుతో పాటు చేతివృత్తులపై స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా వారానికి మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రశాంతి, శిక్షణటీచర్ పి.హైమావతి తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

సోంపేట: మండలంలోని జింకిభద్ర పంచాయతీలో సిమెంటు రహదారి నిర్మాణ పనులకు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. సర్పంచ్ తామాడ పద్మావతి, ఉప సర్పంచ్ సాహుకారి జానీ, గ్రామపెద్దలు తామాడ చంద్రశేఖర్, అనంత్ పెద్ద కోట పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లతో విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: అన్నివర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్, సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి అన్నారు. తేలుకుంచి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు సోమవారం ట్యాబ్‌లు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు బెండి గోవిందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నియంత్రణపై అవగాహన



శ్రీనివాసానగర్‌లో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

టెక్కలి: చర్మంపై ఎటువంటి మార్పులు వచ్చినా, మచ్చలు ఉన్నా తక్షణమే తమకు తెలియజేయాలని గ్రామ సచివాలయ వైద్య సిబ్బంది అన్నారు. టెక్కలి గ్రామసచివాలయం-1 పరిధిలోని వీధుల్లో సోమవారం కుష్టు వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ వై.దేవి, ఆరోగ్య కార్యకర్త ఎస్.పాపాయమ్మ, ఆశ వర్కర్లు పద్మ, ఉమ తదితర వైద్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి ఆయా కుటుంబాల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. కుష్టు నియంత్రణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఉపాధి పనులు ప్రారంభం

వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పిల్ల గెడ్డ అభివృద్ధి పనులను పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనులతో వలసల నివారణ సాధ్యమన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ జాబ్ కార్డును మంజూరు చేస్తూ స్థానికంగా ఉపాధి కల్పిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శిష్టి నీలాచలం, మామిడి గోవిందరావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్.రామకృష్ణ ఉన్నారు.

అభివృద్ధికి చిరునామా సీఎం జగన్ పాలన

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం



జలంత్రకోటలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



గోకర్ణపురంలో హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

కంచిలి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన అభివృద్ధికి చిరునామాగా నిలిచిందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన భవనాల ప్రారంభం, అభివృద్ధి పనులకు సోమవారం భూమి పూజ చేశారు. జలంత్రకోట పంచాయతీ కేంద్రంలో రూ. 40 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.21 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్ర భవనాన్ని, గోకర్ణపురం గ్రామంలో రూ.40 లక్షల ఉపాధి నిధులతో చేపట్టిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.21 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే భవనాన్ని, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. అలాగే బొగాబెణి పంచాయతీ పరిధి ఎస్.బొనమాళి, కొల్లూరు పంచాయతీ పరిధి గుండాం గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను పునఃప్రారంభించారు. అలాగే కొల్లూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, సర్పంచ్‌లు యారడి ఆనందరావు, గణప సింహాచలం, ఎంపీటీసీ సభ్యులు బొండాడ వైకుంఠరావు, భాగ్యవతి పండా, దుర్గాసి మాధవరావు, నాయకులు దుర్గాసి ధర్మారావు, పైల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కళాకారులకు పురస్కారాల ప్రదానం



పురస్కారం అందుకుంటున్న ధనుంజయరెడ్డి, ధనావతి

ఇచ్ఛాపురం రూరల్: తెలంగాణ రాష్ట్రం హనుమకొండకు చెందిన యువచైతన్య వెల్ఫేర్, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్తంగా అందజేసే తెలుగు వెలుగు విశిష్ట కళారత్న జాతీయ పురస్కారాన్ని మండలానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు, నంది అవార్డు గ్రహీత తిప్పన ధనుంజయరెడ్డి, ఆలిండియా కళారంగం జిల్లా ఉపాధ్యక్షురాలు పెదిన ధనావతిలు అందుకున్నారు. ఆదివారం రాత్రి హనుమకొండలో జరిగిన స్వామి వివేకానంద నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతోత్సవాలు ముగింపు సందర్భంగా పురస్కారాలను ప్రదానం చేశారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 20వ వార్డులో మున్సిపాలిటీ నిధులు రూ.23 లక్షలతో సీసీరోడ్డు పనులకు కౌన్సిలర్ అంబటి మాధురి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. లేబరుకాలనీ మంకినమ్మతల్లి ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు, మరోరోడ్డు సైన అప్పన్న వీధిలో సీసీ రోడ్డు నిర్మించనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు సీదిరి త్రినాథ్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అంబటి ఆనందరావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్, పట్టణ అధికార ప్రతినిధి శిష్టు గోపి, ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడి ధుర్యోధనరావు, ఇరిగేషన్ రాష్ట్ర డైరెక్టర్ మల్లా రవికుమార్, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ స్పందనకు 25 వినతులు



వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 25 వినతులు అందాయి. టెక్కలి హుద్‌హుద్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు కోరారు. కోటబొమ్మాళి మండలం చిట్టివలస గ్రామంలో ఇనాం భూములకు పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించాలని సింహాచలం, టెక్కలి శ్రీనివాసానగర్‌లో రోడ్డు మధ్యలోని విద్యుత్ స్తంభాలు తొలగించాలని కాలనీవాసులు విన్నవించారు. గతంలో తనకు ఇచ్చిన భూమిని ఆక్రమించాలని ప్రయత్నిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని చాపరా గ్రామానికి చెందిన జగదాంబ కోరారు. సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొన్నారు.

ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీలు

మందస: మండలంలోని గిరిజన ప్రాంతాల్లోని ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, ఉపాధ్యక్షులు సవర ధర్మారావు, గురునాథ్, ఫాల్గుణరావు కోరారు. ఈ మేరకు మందసలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొండలోగాం పంచాయతీలో 110 గిరిజన కుటుంబాలు లక్ష్మీనారాయణపురం రెవెన్యూ పరిధిలో 70 ఎకరాలను ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారన్నారు. గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి, ఈ భూములను కాజేయాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సాబకోట పంచాయతీలోని మాణిక్యపట్నం, సింగుపురం, బిత్తరబంద, బుడారిసింగి పంచాయతీలోని నవరపద్మాపురం, కొండలోగాం పంచాయతీలో చాపరాయివీధి తదితర ప్రాంతాల్లో గిరిజనుల భూములను గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్నారన్నారు. ఇతర జిల్లాల నుంచి కూడా పెత్తందారులు మందస మండలానికి వచ్చి, భూములను ఆక్రమించుకుంటున్నారన్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లోని శ్మశానాలు, చెరువులు కూడా అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. అధికార యంత్రాంగం స్పందించి, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, సీఐటీయూ నాయకుడు పొందర దేవేంద్ర, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సవర మీనాక్షి, ఝాన్సీ, తిరుపతిరావు, రమణ, కూర్మారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురు చేరిక



తాపీమేస్త్రీల సంఘ ప్రతినిధులకు పార్టీ కండువ వేస్తున్న సాయిరాజ్, నిమ్మన దాస్

సోంపేట: సోంపేట మేజర్ పంచాయతీ తాపీ మేస్త్రీల సంఘ అధ్యక్షుడు తోట మోహనరావు, సంఘ ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో సోమవారం చేరారు. సోంపేట పట్టణంలో మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేజర్ పంచాయతీకి చెందిన కనక దుర్గ మేస్త్రీల సేవా సంఘం అధ్యక్షుడు మోహనరావు, ఉపాధ్యక్షుడు కోలా దుర్యోధనలతో పాటు మరో 150 మంది పార్టీలో చేరగా..వారికి సాయిరాజ్ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ అభ్యర్థి విజయానికి అందరూ కృషి చేయాలన్నారు. మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, సర్పంచ్ నగిరి ప్రభావతి, ఎంపీటీసీ సభ్యుడు పొడుగు కామేష్ ఉన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



ఎం.బి.అప్పారావు

ఇచ్ఛాపురం రూరల్: మండల తహసీల్దార్‌గా మూల భాస్కర అప్పారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాడేరు కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తూ ఆయన ఇచ్ఛాపురం తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఉపతహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరించారు. సిబ్బంది నూతన తహసీల్దార్‌కు అభినందనలు తెలియజేశారు.

పలాస తహసీల్దార్గా ఎస్.వి.వి.ఎస్.నాయుడు..



ఎస్.వి.వి.ఎస్.నాయుడు

కాశీబుగ్గ/పలాస: పలాస మండల తహసీల్దార్‌గా ఎస్.వి.వి.ఎస్.నాయుడు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా నాతవరం తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ నాలుగున్నరేళ్లు పనిచేసిన లంబాల మధుసూదనరావు అనకాపల్లి జిల్లా కంశికోట మండలానికి బదిలీపై వెళ్లారు.

ఎంపీడీవోగా వైకుంఠరావు



వైకుంఠరావు

కాశీబుగ్గ: పలాస మండలాభివృద్ధి అధికారిగా మెట్ట వైకుంఠరావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్.రమేష్‌నాయుడు విజయనగరం జిల్లా బలిజిపేట మండలానికి బదిలీపై వెళ్లారు. మండల పంచాయతీ విస్తరణాధికారిగా పని చేస్తున్న వైకుంఠరావుకు ప్రభుత్వం ఎంపీడీవో పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.



కోటబొమ్మాళి: లచ్చన్నపాత్రుడుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న డీటీ ఆర్.మధు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి తహసీల్దార్‌గా పి.లచ్చన్నపాత్రుడు బాధ్యతలు స్వీకరించారు. విశాఖ జిల్లా చింతపల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన కామేశ్వరమ్మ అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు బదిలీ అయ్యారు. లచ్చన్నపాత్రుడుకు డిప్యూటీ తహసీల్దార్ ఆర్.మధు, ఆర్‌ఐ శివరామకృష్ణ, సిబ్బంది పూలబొకేలతో స్వాగతం పలికారు.

సీఎం జగన్‌కు అండగా నిలవాలి



సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ విజయ

సోంపేట: సంక్షేమ పథకాలతో అన్నివర్గాల వారిని ఆదుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ కోరారు. సోంపేట మేజర్ పంచాయతీలో జెడ్పీ నిధులు రూ. పది లక్షలతో నిర్మాణం చేపట్టిన తాపీ మేస్త్రీల సంఘ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సంఘ ప్రతినిధులను కోరారు. గమేలా, తాపీ తదితర పనిముట్లను జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తలపైకి ఎత్తుకుని తాపీ మేస్త్రీల సంఘంపై ఆమెకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మన దాస్, మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, సర్పంచ్ నగిరి ప్రభావతి, ఎంపీటీసీ సభ్యుడు పొడుగు కామేష్, నాయకులు కొంచాడ నెహ్రూ, బొండా వైకుంఠరావు, సంఘ అధ్యక్షుడు తోట మోహనరావు, కోలా దుర్యోధన పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత




బీమా మొత్తాన్ని అందజేస్తున్న నాయకులు

నందిగాం: నందిగాం పంచాయతీలో మృతి చెందిన పలువురి కుటుంబసభ్యులకు జేసీఎస్ మండల ఇన్‌చార్జి జడ్యాడ జయరాం సోమవారం వైఎస్సార్ బీమా మొత్తాన్ని అందజేశారు. కురమాన తులసీరావు, కూర్మాపు కృష్ణారావు, కొండపేటకు చెందిన చిప్పాడ మోహనరావులు చనిపోవడంతో నామినీగా ఉన్న వారి భార్యలు రాధిక, నీలవేణి, హేమలతలకు ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున్న వారి బ్యాంకు ఖాతాలకు జమచేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌లు రామకృష్ణ, నిరంజన్, వార్డు మెంబర్లు సీమల లక్ష్మీనారాయణ, లోళ్ల అప్పారావు, బాలక మోహనరావు, బెండి బాబూరావు, పాత్రో లక్ష్మణరావు ఉన్నారు.

'ప్రకృతి' పంటలతో ఆరోగ్యం

సోంపేట: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేసిన కూరగాయల వినియోగంతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. పలాసపురం యూనిట్ ద్వారా ప్రకృతి వ్యవసాయం సాగుపద్ధతిలో పండించిన వివిధ ఉత్పత్తులను తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం విక్రయించారు. మండల యాంకర్ కుమారి, సీఆర్‌పీఎస్‌లు కృష్ణవేణి, జయలక్ష్మి, సుజాత, శ్రావణి, పుష్పలత ఉన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన



హాజరైన విద్యార్థులు

ఇచ్ఛాపురం: రోడ్లపై వాహనాలు నడిపేవారంతా ట్రాఫిక్ నియమాలను పాటించినప్పుడే సురక్షిత ప్రయాణం సాధ్యమని కరాపాడు టోల్‌ప్లాజా మేనేజర్ సెంధిల్‌కుమార్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం వై.లత, టోల్‌ప్లాజా సిబ్బంది సంజయ్, కిరణ్ కుమార్, రవి, బిన్ని ఉన్నారు.

వాలీబాల్ క్రీడాకారుడికి సన్మానం



అభిరాంను సత్కరిస్తున్న దృశ్యం

కవిటి: ఖేలో ఇండియా నేషనల్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి రాష్ట్ర జట్టు కాంస్య పతకం సాధించడంలో బద్ద అభిరాం చూపిన ప్రతిభ అద్భుతమని వక్తలు అన్నారు. సోమవారం కవిటి కల్యాణీ పాఠశాలలో కల్యాణీ గ్రూప్ సంస్థల అధినేత లోళ్ల రాజేష్.. అభిరాంను దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. హైస్కూల్ విద్యను కొనసాగిస్తున్న విద్యార్థులు క్రీడల్లో మంచి ప్రతిభ ప్రదర్శించాలనే ప్రేరణ కల్పించేందుకు అభిరాంను సత్కరించినట్టు ప్రిన్సిపాల్ బిందు మాధవి అన్నారు. జిల్లా వాలీబాల్ సంఘం సంయుక్త కార్యదర్శి బి.రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పలాస ఖోఖోజట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పలాస ఖోఖో జట్టు

కాశీబుగ్గ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీల్లో ఖోఖో విభాగంలో పలాస జట్టు విజయకేతనం ఎగురవేసి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పురుషోత్తపురం సచివాలలయానికి చెందిన ఖోఖో జట్టు క్రీడాకారులు మండల స్థాయి, నియోజకవర్గం స్థాయిలో విజయం సాధించడం ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు దూసుకెళ్లింది. శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాతపట్నం, టెక్కలి, ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల నియోజకవర్గాలపై గెలిపొందారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఖోఖో జట్టు ఈ నెల తొమ్మిది నుంచి 13వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న పోటీల్లో తలపడుతోందని కోచ్ బొండాడ తిరుమలరావు తెలిపారు.

ఆస్పత్రులకు వెళ్లి.. పింఛన్లు అందించి..



కవిటి: చినబాబుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పావని



కాశీబుగ్గ: చంద్రావతికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జయలక్ష్మి

కాశీబుగ్గ: మున్సిపాలిటీ 29వ వార్డుకు చెందిన డోకి చంద్రావతి అనారోగ్యంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స తీసుకుంటున్నారు. ఈమెకు ఈ నెలకు మంజూరైన వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ పాతాళ జయలక్ష్మి సోమవారం ఆస్పత్రికి వెళ్లి చంద్రావతికి అందించి ఆదర్శంగా నిలిచారు.

కవిటి: ఇద్దివానిపాలెం గ్రామానికి బట్టి చినబాబు రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నెలకు మంజూరైన పింఛన్ మొత్తాన్ని గ్రామవలంటీర్ గండుపల్లి పావని ఆస్పత్రికి వెళ్లి అందించారు.

ఇంటి పన్ను వసూలు చేయాలి

నరసన్నపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటి పన్ను ఆన్‌లైన్లో (ఫోన్ పే, స్వైపింగ్ మిషన్ ద్వారా) వసూలు చేయాలని గ్రామ వలంటీర్లకు నరసన్నపేట పంచాయతీ ఈఓ సవర చిన్నారావు సూచించారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. మేజరు పంచాయతీ పరిధిలో 7640 ఇళ్లు ఉన్నాయని, వీటిన్నింటికీ పన్నులు వసూలు చేయాలన్నారు.

కుమార్ నాయక్‌కు ఉత్తమ నటుడు అవార్డు

కాశీబుగ్గ: ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ (ఐఎఫ్ఎంఏ) సౌజన్యంతో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్-2024 బెస్ట్ యాక్టర్ ఫిలిం అవార్డు పలాసకు చెందిన సినీ, టీవీ కళాకారుడు డాక్టర్ కుమార్ నాయక్‌కు దక్కింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ జయప్రకాష్, టీటీడీ బోర్డు సభ్యుడు నాగసత్యలు కుమార్ నాయక్‌కు అవార్డును అందజేశారు. మందస జమీందారుల పాలనలో జరిగిన రైతు ఉద్యమంలో భాగంగా చారిత్రాత్మకమై వీరనారి గున్నమ్మ సినిమాలో రాజగురువు పాత్రకు ఈ అవార్డు అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న కుమార్ నాయక్